



నూకాంబికను దర్శించుకుంటున్న క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి

నూకాంబికను దర్శించుకున్న క్రికెటర్ నితీశ్

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారిని ఆదివారం భారత క్రికెటర్ నితీశ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, తదితరులు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. బాలాలయంలో అమ్మవారికి పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో కెఎల్ సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను వీరికి స్వాగతం పలికారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో అక్రమాలపై
శీఘ్ర విచారణ

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాలు

- వైసీపీ హయాంలో వైద్యాలయంలో అవినీతి, అక్రమాలు
- ఫిర్యాదులు రావడంతో ఏసీబీ తనిఖీలు
- వాస్తవమని నిర్ధారిస్తూ 2020లో అప్పటి ప్రభుత్వానికి నివేదిక
- బుట్టదాఖలు చేసిన వైసీపీ పాలకులు
- తాజాగా మంత్రి దృష్టికి రావడంతో విచారణకు ఆదేశాలు

అనకాపల్లి రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో కొంత మంది వైద్య సిబ్బంది చేసిన అవినీతి, అక్రమాలపై ప్రస్తుత వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శీఘ్ర విచారణకు ఆదేశించారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో అనకాపల్లిలోని ఎన్టీఆర్ వైద్యాలయంలో పలు అక్రమాలు జరిగాయి. ఇన్‌పేషెంట్ల తప్పుడు లెక్కలు, మందుల వినియోగాన్ని రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయకపోవడం, లైసెన్సు లేకుండా క్యాంటీన్ నిర్వహణ, ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న రోగులకు అందించే భోజనాల వివరాలు తెలపకపోవడం, రోగులకు సరఫరా చేసే ఆహారంలో నాణ్యత లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లకు సివిల్ పనులు కట్టబెట్టడం వంటి ఆరోపణలు వచ్చాయి. వీటిపై అందిన ఫిర్యాదుల మేరకు 2020 ఫిబ్రవరిలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. అప్పటి డీసీహెచ్ఎస్‌తోపాటు తొమ్మిది మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులు/ స్టాఫ్ నర్సులు కలిపి అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారుల బృందం గుర్తించింది. వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే తరువాత నాలుగేళ్లపాటు అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వం, అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా, ఏసీబీ ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేసింది. ఈ నేపథ్యంలో కూటమి ... మిగతా 6వ పేజీలో

సీనరేజ్

ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.16 కోట్లకు టెండరు ఆహ్వానించిన గనుల శాఖ

- రంగంలోకి దిగిన ఇద్దరు కూటమి ప్రజాప్రతినిధులు
- తమ వారికే బిడ్ ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి

కాంట్రాక్టు కోసం పట్టు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖ జిల్లాలో గనుల సీనరేజీ వసూళ్ల కాంట్రాక్టు కోసం భారీగా పోటీ నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా గనుల లీజులు, తాత్కాలిక పర్మిట్లు, ఇతరత్రా జరిమానాల రూపంలో రూ.11 కోట్లు వసూలవుతుంది. దీనిని పరిగణనలోనికి తీసుకుని సీనరేజీ వసూళ్ల కోసం నెలకు రూ.16 కోట్లకు టెండరు ఆహ్వానించింది. దీంతో ఉత్తరాంధ్రలోని రెండు జిల్లాలతోపాటు ఉభయగోదావరి జిల్లాల్లో సీనరేజీ వసూలు చేస్తున్న సంస్థలతో పాటు మరో సంస్థ బిడ్లు వేసింది. ప్రభుత్వం ఇంకా వాటిని ఓపెన్ చేయలేదు. అయితే కూటమి ప్రభుత్వంలో కొందరు ప్రజాప్రతినిధులు తమ వారికే కాంట్రాక్టు దక్కేలా చక్రం తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో కోస్తా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం సాగుతోంది.



అనకాపల్లి మండలం కుంచంగి సర్వే నంబరు 316లో రాయి క్వారీ (ఫైల్ ఫొటో)

జిల్లాలో ప్రభుత్వం అనుమతించిన క్వారీల్లో తవ్వకాలకు భిన్నంగా పలు రకాల గనులు తవ్వి తరలిస్తున్నారనే సమాచారంతో గత ప్రభుత్వం సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. గనుల శాఖలో పరిమితంగా ఉన్న సిబ్బందితో సీనరేజ్ వసూళ్లతోపాటు అక్రమ క్వారీయింగ్‌ను అరికట్టలేమని ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం అమలుచేసిన కాంట్రాక్టు విధానాన్ని కొనసాగించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. వైసీపీ హయాంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల కాంట్రాక్టులను రెండు సంస్థలకు అప్పగించింది. ఉమ్మడి విశాఖ జిల్లా టెండరును అప్పటి వైసీపీ నేతలు అడ్డుకోవడంతో విరమించుకుంది. అయితే ప్రస్తుత ప్రభుత్వం, గతంలో కాంట్రాక్టు ఇవ్వని జిల్లాలను ... మిగతా 6వ పేజీలో

పిచ్చికుక్క స్వైర విహారం

- పది మందికిపైగా గాయాలు

మునగపాక, జూలై 27 (ఆంధ్రజ్యోతి):



పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాధితులు

మండలంలోని ఒంపోలు గ్రామం లో ఆదివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు పది మంది పిచ్చికుక్క కాటుకు గురయ్యా రు. చేతులు, కాళ్లు, ఇతర శరీర భాగా లను విచక్షణారహితంగా కరిచింది. దీంతో గ్రామస్థులు కర్రలతో వెంబ డించి పిచ్చికుక్కను హతమార్చారు. కుక్కకాటు బాధితులు రాజాన కేశవరావు, జంగం సత్తిబాబు, రౌతు సత్యనారాయణ, వేపాడ సాయి, తదితరులను చికిత్స, వ్యాక్సిన్ నిమిత్తం కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.



రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

- హోం మంత్రి అనిత
- పది పీఏసీఎస్‌ల నూతన చైర్‌పర్సన్లతో ప్రమాణ స్వీకారం

నక్కపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం మంత్రి క్యాంప కార్యాలయం వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, అన్నదాత ... మిగతా 6వ పేజీలో

పీఏసీఎస్‌ల చైర్‌పర్సన్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హోం మంత్రి. వేదికపై ఎంపీ సీఎం రమేశ్, డీసీసీబీ పర్సన్‌ఇన్‌చార్జి కోన తాతారావు, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోట్ని బాలాజీ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కూటమి నాయకులు.

రాంకీకి పీసీబీ నోటీసులు

నిబంధనలకు విరుద్ధంగా సీడబ్ల్యూఎంపీలో వందల టన్నుల ఘన వ్యర్థాల నిల్వ

- కాలుష్య నియంత్రణ మండలి అధికారుల తనిఖీలతో వెలుగులోకి..
- 40 రోజుల వ్యవధిలో రెండోసారి నోటీసులు జారీ



తాడి కొండకు ఆనుకొని ఉన్న రాంకీ ఘన వ్యర్థాల నిల్వ కేంద్రం

పరవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్‌కు డెవలపర్‌గా వ్యవహరిస్తున్న రాంకీ యాజమాన్యానికి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ పీసీబీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు పీసీబీ ఈఈ పీవీ ముకుందరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాంకీ సంస్థకు చెందిన కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ (సీడబ్ల్యూఎంపీ) షెడ్ల వెనుక ప్రదేశంలో నిబంధనలకు విరుద్ధంగా వందల టన్నుల ఘన వ్యర్థాలను నిల్వ చేసింది. ఇటీవల పీసీబీ అధికారులు తనిఖీలు చేపట్టినప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిని పీసీబీ అధికారులు తీవ్రంగా పరిగణించారు.

ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు ఫార్మా కంపెనీల నుంచి ఘన వ్యర్థాలను వాహనాల్లో ఫార్మాసిటీకి తరలిస్తారు. రాంకీ సంస్థ వీటిని ప్రాసెస్ చేసి సమీపంలోని తాడి గ్రామం కొండకు ఆనుకొని ఉన్న ల్యాండ్ ఫిల్ (ఘన వ్యర్థాల నిల్వ కేంద్రం)కు తరలిస్తుంది. ఇందుకుగాను రాంకీ యాజమాన్యానికి సదరు ఫార్మా కంపెనీలు కొంత రుసుం చెల్లిస్తాయి. అయితే కొండను ఆనుకొని ఉన్న ల్యాండ్ ఫిల్ పూర్తిగా నిండిపోయింది. దీంతో రాంకీ యాజమాన్యం తమ (సీడబ్ల్యూఎంపీ) షెడ్లకు వెనుక ప్రదేశంలో వ్యర్థాలను అక్రమంగా నిల్వ చేసింది. పీసీబీ అధికారుల తనిఖీల్లో బయటపడింది.

ఇదిలావుండగా ల్యాండ్ ఫిల్ ప్రాంతం పూర్తిగా నిండిపోవడంతో రాంకీ యాజమాన్యం కొద్ది రోజులుగా ఫార్మా కంపెనీల నుంచి వ్యర్థాలను తీసుకునే ప్రక్రియను నిలిపివేసింది. దీంతో వ్యర్థాలను కంపెనీల్లో నిల్వ ఉంచాల్సిన పరిస్థితి నెలకొందని పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇక్కడ ఘన వ్యర్థాల నిల్వకు మరో కేంద్రం (ల్యాండ్‌ఫిల్) ఏర్పాటు అయ్యే వరకు నెల్లూరు జిల్లాలోగల ఘన వ్యర్థాల నిల్వ కేంద్రానికి ... మిగతా 6వ పేజీలో

బేఖాతర్

పురావస్తు శాఖ స్థలంలో ఆగని అక్రమ నిర్మాణాలు

- ప్రధాన రహదారి వైపు పరదాలుకట్టి గుట్టుచప్పుడు కాకుండా పనులు
- స్పందించని మునిసిపల్, రెవెన్యూ అధికారులు



బ్రిటీష్ సైనిక అధికారుల సమాధుల స్థలంలో జరుగుతున్న సిమెంట్ కాంక్రీట్ పిల్లర్ల నిర్మాణ పనులు

అనకాపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నంలోని పురావస్తు శాఖ స్థలంలో అక్రమ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. శనివారం పునాదుల కోసం గోతులు తవ్వించిన ఆక్రమణదారులు.. ఆదివారం కాంక్రీట్ పిల్లర్ల పనులు చేయించారు. రెండు రోజుల నుంచి పురావస్తు శాఖ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అధికారులెవరూ ఇటువైపు కన్నెత్తయినా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

స్వాతంత్ర్య పోరాట సమయంలో మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరులు దామనాపల్లి మాటులో దాడి చేసి, బ్రిటీష్ సైనిక అధికారులు క్రిస్టోఫర్ విలియం స్కాట్ కవర్, లియోనెల్ నెవెల్లీ హైటర్ హతమార్చారు. అనంతరం అప్పటి బ్రిటీష్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మృతదేహాలను నర్సీపట్నం తీసుకువచ్చి, ఆర్అండ్‌బీ బంగ్లాకు సమీపంలో సుమారు 46 సెంట్ల స్థలంలో ఖననం చేశారు. సమాధులున్న ప్రదేశం కావడంతో చాల కాలంపాటు ఈ స్థలం వైపు ఎవరూ చూసే వారుకాదు. అయితే ప్రధాన రహదారి పక్కన వుండడం, క్రమేణా పట్టణం విస్తరించడంతో స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీంతో సమాధుల స్థలాన్ని కొంతమంది ఆక్రమించి ఇళ్లు, దుకాణాలు నిర్మించుకున్నారు. చివరకు 19 సెంట్లు స్థలం మిగిలింది. ఈ నేపథ్యంలో 2011లో స్థలం పరిరక్షణ బాధ్యతలను పురావస్తు శాఖ తీసుకుంది. కాగా మెయిన్ రోడ్డుని ఆనుకొని వున్న దుకాణాలను గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పడగొట్టారు. ఇదిలావుండగా కొద్ది రోజుల క్రితం సమాధులున్న ప్రదేశంలో మరికొంత స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నాలు జరిగాయి. స్థలం పరిరక్షణ, అభివృద్ధి కోసం అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ ప్రతినిధి సత్యనారాయణరావు న్యాయ సేవాధికార సంస్థలో ఫిర్యాదు చేశారు. ఈ నెల 10 తేదీన న్యాయమూర్తి షియాజ్‌ఖాన్ సమాధుల స్థలాన్ని సందర్శించి పరిరక్షణ చర్యలు తీసుకోవాలని మునిసిపల్, రెవెన్యూ, పురావస్తు శాఖ ఏడీకి ఆదేశించారు. తక్షణమే సరిహద్దులు నిర్ణయించాలని చెప్పారు. దీంతో పురావస్తు శాఖ ఏడీ షణ్ముఖరావు బ్రిటీష్ సైనిక అధికారుల ... మిగతా 6వ పేజీలో

హెచ్‌ఎంల జిల్లా సంఘం నూతన కార్యవర్గం

- అధ్యక్షునిగా ఏవీహెచ్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా ఆళ్ల శేఖర్



ప్రమాణ స్వీకారం చేస్తున్న హెచ్ఎంలు

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం స్థానిక గౌరీ గ్రంథాలయంలో జరిగాయి. అధ్యక్షుడిగా ఏవీహెచ్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా ఆళ్ల శేఖర్, కోశాధికారిగా నాగేంద్ర, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎంఎస్ ప్రసాద్, కేఆర్ఎస్ నాయుడు, ఎ.వరహామూర్తితోపాటు పలువురిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి సీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించాలని, ఎంఈవోల బదిలీలను వెంటనే చేపట్టాలని, హెచ్‌ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలని, బోధనేతర విధుల నుంచి ప్రధానోపాధ్యాయులకు పూర్తిగా విముక్తి కలిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. పరీక్షల విభాగం సహాయ కమిషనర్ పి.శ్రీధర్‌రెడ్డి, డీసీఈబీ బోర్డు చైర్మన్ సీహెచ్.సత్యనారాయణ, ముఖ్య అతిథులుగా పొన్నాడ అప్పారావు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు బోధనకే పరిమితం

కర్మయోగి యాప్, పీ-4 బాధ్యతల నుంచి మినహాయించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి వినతి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, హాజరైన నేతలు, ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కర్మయోగి యాప్, పీ-4 బాధ్యతల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, టీచర్లను బోధనకు మాత్రమే పరిమితం యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఇక్కడ జరిగిన యూటీఎఫ్ ముఖ్య ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించడం వల్ల విద్యా ప్రమాణాలు కుంటుపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, వారు పనిచేసే గ్రామాల్లో అట్టడుగున ఉన్న కుటుంబాలను దత్తత తీసుకోమని చెప్పడం బోధనేతర పనుల కిందకే వస్తుందన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించలేరని పేర్కొన్నారు. అలాగే కర్మయోగి అనే యాప్‌ను ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దుతున్నారని, ఇందులో ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రతి ఉపాధ్యాయుడు 56 వీడియోలు పూర్తి చేయాలని బలవంతం చేయడాన్ని యూటీఎఫ్ వ్యతిరేకిస్తున్నదని పేర్కొన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి, ప్రతినిధులు రొంగలి అక్కునాయుడు, పొలిమేర చంద్రరావు, రమేశ్‌రావు, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్ ఒకరి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన రామిరెడ్డి

పరవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

పరవాడ- లంకెలపాలెం ప్రధాన రహదారిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన కొండపురెడ్డి రామిరెడ్డి (39) కొన్నేళ్ల నుంచి పరవాడ ఫార్మాసిటీలోని రాంకీకి చెందిన కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ (సీడబ్ల్యూఎంపీ)లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి విశాఖ నగరంలోని కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం సాయంత్రం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఫార్మా సిటీలోని లారస్ ల్యాబ్స్ ఫార్మా పరిశ్రమ సమీపంలోకి వెళ్లేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. దీంతో కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుడి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు.

పేదల కోసం ఎన్టీఆర్ పార్టీ స్థాపన

- రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు



కొత్తలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రగడ నాగేశ్వరావు, పప్పల చలపతిరావు

ఎలమంచిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రపంచ చరిత్ర పటంలో ఎన్టీ.రామారావు నిలిచిపోయారని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కొనియాడారు. ఆదివారం మండలంలోని కొత్తలి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు కొలుకులూరి విజయ్‌బాబు, రాజాన సూర్యనాగేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కార్యదర్శి గెంజి శ్రీను, మాజీ వైస్ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరావు, ఇత్తంశెట్టి రాజు, స్థానిక నేతలు కాళ్ల రామారావు, మర్రి నాగేశ్వరావు, కాళ్ల రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీకి పూర్వ వైభవం తేవాలి'



మాట్లాడుతున్న సమన్వయకర్త ధర్మశ్రీ

రాంబిల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వైసీపీకి పూర్వవైభవానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆపార్టీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త క రణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. మాజీ వైసీపీ ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని, కనీసం జీవనభృతి కూడా లేకుండా మోసం చేసిందన్నారు. వైసీపీ రాష్ట్ర నాయకులు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులు ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలశాఖ అధ్యక్షుడు పి.కిశోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ రాంబిల్లి మాజీ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు, జడ్పీటీసీ సభ్యుడు దూళి నాగరాజు, నేతలు కొవిరి రామకృష్ణ, నెట్టెం సత్యంనారాయణ, మాస్టర్‌బాబు, గిరిరాజు, హుజూర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్జన్లకు మార్గదర్శకం 'స్టడీ హ్యాండ్స్, స్టడీ మైండ్'

పాయకరావుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రెడిడెంట్ డాక్టర్ ఎం.కృష్ణారెడ్డి రచించిన 'స్టడీ హ్యాండ్స్, స్టడీ మైండ్' పుస్తకం వైద్య విద్యార్థులు, సర్జన్లకు మార్గదర్శకంగా ఉంటుందని మంత్రి అనిత అన్నారు. ఈ పుస్తకాన్ని రచించిన డాక్టర్ మురళీ కృష్ణారెడ్డికి ఆదివారం ఆమె అభినందించారు. ఇటువంటి రచనలు వైద్య వృత్తిలో మానవీయతను పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని ఆమె అన్నారు. రెసిడెంట్ల కోసం ప్రత్యేకంగా ఈ పుస్తకం రాసినట్టు డాక్టర్ మురళీకృష్ణారెడ్డి చెప్పారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం

కోటవురట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నర్సీపట్నం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డీజీనాథ్ సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా చిటికెల శ్రీరామూర్తి, ప్రధాన కార్యదర్శిగా కాకర విజయకుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సభ్యులు అబ్దుల్లా, డేవిడ్ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

రాంబిల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజిరెడ్డిపాలెంలో ఆదివారం వంకా బిందు, వెంకటరమణకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు దగ్ధమైంది. ఎలమంచిలి నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేసరికి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన మండల అధ్యక్షుడు నూకన్నదొర బాధితులను పరామర్శించారు.

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ఎస్.రాయవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బదిలీ జరిగిన ఉపాధ్యాయుల జీతాలు తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేకేఎల్ఎన్. దర్మారావు, ఎస్.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించి నెల రోజులైనా జూన్ నెల జీతాలు అందించకపోగా జూలై నెల జీతం కూడా క్లెయిమ్‌చేసే పరిస్థితిలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని మృతదేహం

ఎలమంచిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి-నరసింగవల్లి స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ జి. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగి, ఎడమ చేతిపైన త్రిశూలం పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృత దేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు చెప్పారు. వివరాలు తెలిసిన వారు ఫోన్: 94906 19020 తెలియజేయాలని కోరారు.

శిథిల స్థితిలో పశుసంవర్ధక శాఖ భవనం

- ఏడీ కార్యాలయ సిబ్బంది భయంతో విధులు
- పదేళ్ల కిందట నిధులు మంజూరు... పనులు చేపట్టక వెనక్కి మరలిన వైనం



పాయకరావుపేటలో శిథిలావస్థలో ఏడీ కార్యాలయం

పాయకరావుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న పశునం వర్ధక శాఖ ఏడీ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు పదేళ్ల కిందట నూతన కార్యాలయం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పట్టించుకున్న నాథుడులేక పోవడంతో అప్పటినుంచి శిథిల భవనంలోనే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. పట్టణం లోని బృందావనం కాలనీలోని విద్యుత్ శాఖ కు చెందిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాల యం ఆవరణలో పదేళ్ల కిందట పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహాయ సంచాలకుల కార్యాల యం పరిధిలో మండలంలోని మంగ వరం, సత్యవరం, శ్రీరాంపురంతో పాటు నాతవరం మండలంలోని నాతవరం, గునుపూడి, శృంగవరంలో ఉన్న పశువైద్య శాలలతోపాటు నమ్మచింతలో ఉన్న సబ్ సెంటర్లున్నాయి. వీటి ద్వారా సుమారు 50వేల సంఖ్యలో ఉన్న పశువులు, మేకలు, గొర్రెలు ఇతర పెంపుడు జంతువులకు వైద్య సేవలు అందుతున్నాయి. పదేళ్ల క్రితం కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నూతనభవన నిర్మాణానికి రూ.34 లక్షలు మం జూరుచేసింది. దీంతో పట్టణ శివారులో ఒక లేఅవుట్‌లో పం చాయతీకి కేటాయించిన ఐదు సెంట్ల పంచాయతీ స్థలంలో కార్యాలయ నిర్మాణానికి అప్పటి రాష్ట్ర మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే అప్పట్లో వివిధ కారణాలతో శం కుస్థాపన ఆగిపో యింది. అప్పటి నుంచి దీన్ని పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. దీంతో మం జూరైన నిధులు వెనక్కి మరలిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసింది. దీంతో పట్ట ణంలో శిథిలా వస్థలో ఉన్న భవనంలోనే ఏడీ కార్యాలయం, పశువైద్యశాలనూ నిర్వహిస్తున్నా రు. గత కొంతకాలంగా కార్యాలయ శ్లాబ్, గోడల పెచ్చులూడుతుండడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరుతున్నారు.



పట్టణ శివారులో కార్యాలయ నిర్మాణానికి 2016లో ఏర్పాటుచేసిన శిలాఫలకం

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



బోడపాలెంలో బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మంత్రి అనిత

కోటవురట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడపాలెం గ్రామానికి చెందిన సుర్ల రాజేశ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో, ఆయన వైద్య సేవల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం అందజేశారు. రాజేశ్ చికిత్స కోసం బిల్లు మంజూరు చేయాల్సిందిగా మంత్రి అనిత సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ మేరకు రూ.5.2 లక్షలను మంజూరు చేయగా, ఆ చెక్కును మంత్రి తన క్యాంపు కార్యాలయంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, నాయకులు జానకి శ్రీనివాసరావు, జిరెడ్డి నానిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు జనసేనలో చేరిక

- తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్ జగ్గారావుతో సహా 200 మంది పార్టీ తీర్థం



తిమ్మరాజుపేట మాజీసర్పంచ్‌తో పాటు జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, జూలై 27, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేటకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. రాంబిల్లి మండలం హరిపురం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్గారావు మిత్ర మండలి ఆధ్వర్యంలో పలువురు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తిమ్మరాజుపేటనుంచి వీరు జనసేన పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వచ్చారు. వైసీపీ నేత, గ్రామ మాజీ సర్పంచ్ శరగడం జగ్గారావు లక్ష్మి దంపతుల సమక్షంలో వార్డు మెంబర్లు శిలపరశెట్టి వెంకట అప్పారావు, శరగడం బుజ్జి, యల్లపు శ్రీను, తుట్టా ధన, షేక్ వీరుబాబు, యల్లపు రమణ, రాపేటి గౌతమ్ తదితర సుమారు 200 మంది సభ్యులు పార్టీలో చేరిన వారిలోఉన్నారు. వీరందరికీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పార్టీలోకిఆహ్వానించారు.కూటమి పాలనలో అభివృద్ధిని చూసి జనసేనలో చేరినట్టు జగ్గారావు ఈ సందర్భంగా తెలిపారు.

అచ్యుతాపురం: మండలంలోని రాజాన పాలెం, చిప్పాడ, ఉద్దపాలెం, తాళ్లదిబ్బ, దిబ్బపాలెం పంచాయతీల నుంచి వైసీపీ శ్రేణులు భారీగా జనసేనలోచేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైలపూడి శ్రీరామదాసు, రాజాన అప్పారావు మాస్టారు, పిల్లి వెంకటరమణ, తుమ్మల రాజు, రమేశ్, పిన్నమరాజు వాసు, కరెడ్ల సూర్యప్రకాష్, ద్వారపురెడ్డి బాహుజీ, కొరుప్రోలు చిన్నారావు పాల్గొన్నారు.

రైతు సంఘాల నిర్వహణ భేష్ : తహసీల్దార్



రైతు సేవా కేంద్రం అధికారిణి సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

మునగపాక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆదర్శనీయంగా నడుస్తున్న రైతు సంఘాలను మునగపాకలో చూస్తున్నట్టు తహశీల్దార్ పి.సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో ఆదివారం మునగపాక గ్రామ రైతు సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూపరమైన సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీనేత కర్రిసాయికృష్ణ మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా క ళ్లాలనుంచి మూల ప్రాంతాలకు వీధిలైట్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ నీటి తీరువాను రైతు సంఘం వ్యతిరేకిస్తుందన్నారు. రైతులకు విశేషమైన సేవలందించిన గ్రామ వ్యవసాయ సహాయకురాలు కోరుకొండ గౌరి సింధూజను ఘనంగా సత్కరించారు. అనంతరం పాత పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. అధ్యక్షుడిగా ఆడారి మహేశ్, కార్యదర్శిగా విల్లూరి నూక నరసింగరావు, ఉ పాధ్యక్షుడిగా దాడి శివ, ఆడారి శ్రీకాంత్, కోశాధికారిగా ఆడారి లక్ష్మణరావులు తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయమ్మ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పెంటకోట విజయ్, టెక్కలి పరశరాం, రైతు సంఘాల ప్రతినిధులు దాడి ముసిలినాయుడు, పోలిమేర గణేష్, సూరిశెట్టి కన్నారావు, కాండ్రేగుల జగ్గారావు, పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే ఉత్తరాంధ్రకు సముచిత స్థానం'



మాట్లాడుతున్న యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాయకులు

రాంబిల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నత స్థాయి కల్పించడం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు అన్నారు. ఆదివారం ఆయన హరిపురంలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్రకు చెందిన అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్ పదవి రావడంలో చంద్రబాబు కృషి ఉందన్నారు. ఉత్తరాంధ్రలో విద్యా సంస్థల స్థాపనకు, ఆలయాలకు వేల ఎ కరాల భూమిని ధారాదత్తం చేసిన అశోక్ గజపతిరాజును గత వైసీపీ ప్రభుత్వం మానసిక సంక్షోభకు గురిచేసిందన్నారు.

పథకాలపై వైసీపీకి అక్కసు తగదు



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ

మునగపాక: ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ప్రయోజనం పొందుతూ తిరిగి కూటమి పాలనపై వైసీపీ విషం చిమ్ముతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ ఆరోపించారు. స్థానికంగా ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజధాని పేరు ముసుగులో ఉత్తరాంధ్రను ఉద్ధరిస్తానని వైసీపీ అధినేత జగన్ చెప్పినా ప్రజలు నమ్మలేదన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటు తనంపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడు చంద్రబాబు ఇక్కడి అభివృద్ధికోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు.సమావేశంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు పెంటకోట విజయ్, పెంటకోట శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

'కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి'

అచ్యుతాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో నునపర్తి, వెదురువాడల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అభి ప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతి రావు, రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేశ్ కుమార్, టీడీపీ మండలఅధ్యక్షుడు కీలా తులసీ రామ్, రెడ్డి నగేశ్, పతివాడ చిన్నయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నునపర్తిలో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు



యర్రవరంలో కరపత్రాలు పంచుతున్న స్థానిక నేత రవికుమార్

ఎలమంచిలి: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలుస్తుందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కరణం రవి అన్నారు. ఆదివారం మునిసిపాలిటీ యర్రవరం వార్డులో స్థానిక నేతలతో కలిసి ఆయన సుపరిపాలనలో ఏడాది కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు వల్ల రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు సేనాపతి రాజామహేశ్, ఎద్దు శివ, ఎస్.తులసీరామ్, బర్నికల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లను సత్కరిస్తున్న మంత్రి అనిత ఎంపీ రమేశ్

పీఏసీఎస్ కార్యవర్గానికి ఘన సత్కారం

కోటవురట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల పీఏసీఎస్ కార్యవర్గాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ ఆదివారం ఘనంగా సత్కరించారు. మంత్రి స్వగృహం వద్ద అధ్యక్షుడు వేచలపు జనార్దన్ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. అధ్యక్షుడిగా జనార్దన్‌తో పాటు డైరెక్టర్లు చిటికెల సత్యనారాయణ, సుంకర నూకినాయుడులను మంత్రి, ఎంపీ శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, మాజీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమలతో మెరుగైన ఉపాధి: ఎమ్మెల్యే



యూపీవీసీ జోన్ మినీ పరిశ్రమ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడివాడలో నిర్మించిన రాజా ప్రసాద్ యూపీవీసీ జోన్ మినీ పరిశ్రమలను ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మినీ కంపెనీల్లో మిషనరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇలాంటి మినీ పరిశ్రమ ఏర్పాటు ద్వారా స్థానికులకు మెరుగైన ఉపాధి లభిస్తుందన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వ సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పుల నూకన్నదొర, నాయకులు బద్ది మహేశ్, గబ్బర్‌సింగ్, నాని, సర్పంచ్ ఎం.అప్పలనర్స, మాజీ సర్పంచ్ సాయివరప్రసాద్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయంతో రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, దీంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా వుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోట్ని బాలాజీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీనరేజ్ కాంట్రాక్ట్ కోసం పట్టు

... 5వ పేజీ తరువాయి

ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయం తీసుకుంది.

అనకాపల్లి జిల్లా కీలకం..

ప్రస్తుత అనకాపల్లి జిల్లాలో మెటల్, గ్రానైట్‌తోపాటు లేటరైట్ క్వారీలు ఉండగా, అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్, విశాఖ జిల్లాలో తక్కువగా క్వారీలున్నాయి. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, విశాఖ, పాడేరులో గనుల శాఖ ఏడీ కార్యాలయాలున్నాయి. ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకున్న క్వారీల నుంచి పూర్తిగా ఆదాయం రావడం లేదు. అనుమతి లేకుండా అనేక క్వారీల నుంచి వందల లారీల రాళ్లు, గ్రావెల్ తరలిపోతోంది. గ్రావెల్ మాఫియా ప్రతి నెలా రూ.కోట్ల విలువైన మట్టి, గ్రావెల్‌ను అనధికారికంగా తవ్వి, తరలిస్తోంది. అనకాపల్లి జిల్లాలో మెటల్ క్వారీల నుంచి ప్రతి రోజూ వందల లారీలతో బండరాళ్లను రాంబిల్లి వద్ద నేవల్ బేస్ నిర్మాణాల కోసం తరలిస్తున్నారు. వీరెవరూ ప్రభుత్వానికి పైసా చెల్లించడం లేదు. కాగా నాతవరం మండలం నరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో లేటరైట్ తవ్వకాలకు సంబంధించి ఇప్పటివరకు పక్కాగా లెక్కలు లేవు. కాంట్రాక్టరు చెప్పింది రాసుకోడం తప్ప గనులశాఖ పట్టించుకోవడం లేదు. లేటరైట్ తవ్వకాల నుంచి ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదు. ఈ నేపథ్యంలో సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్టును ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని గనుల శాఖ అధికారులు భావిస్తున్నారు.

కాంట్రాక్టు సంస్థల పోటీ

ఉమ్మడి జిల్లాలో గనుల శాఖకు ఇప్పటివరకు నెలకు రూ.11 కోట్లు ఆదాయం వస్తోంది. వసూళ్ల బాధ్యత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే నేపథ్యంలో ఆదాయం పెరుగుతుందని భావించిన అధికారులు రూ.16 కోట్లకు టెండర్లు ఖరారుచేశారు. పోటీ ఉన్నందున కాంట్రాక్టు రూ.20 కోట్లకు చేరుతుందని, దీనివల్ల నెలకు రూ.9 కోట్ల చొప్పున ఏడాదికి సుమారు రూ.102 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతో పాటు అనధికార క్వారీయింగ్, దొంగతనంగా లారీల్లో గ్రావెల్, రాళ్లు, గ్రానైట్, లేటరైట్ తరలింపునకు చెక్ పడుతుందని భావిస్తున్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో అక్రమాలపై శీఘ్ర విచారణ

... 5వ పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, గతంలో ఏసీబీ అధికారులు సమర్పించిన నివేదికను బయటకు తీయించి పరిశీలించారు. ఈ వ్యవహారంపై శ్రీఘ్ర విచారణకు ఆదేశించారు. ఈ మేరకు మంత్రి పేషీ నుంచి ఆదివారం ఒక ప్రకటన వెలువడింది. ఈ విషయం తెలుసుకున్న నాటి అక్రమాలు బెంబేలెత్తిపోతున్నారు.

బేఖాతరు..

... 5వ పేజీ తరువాయి

సమాధుల స్థలం స్కెచ్, సరిహద్దు వివరాలు అందించాని తహసీల్దార్‌ని కోరారు. గత గురువారం మెయిన్ రోడ్డు వైపు గ్రీన్ మ్యాట్ (పరదాలు) కట్టి, లోపల నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, ఆర్డీవో కార్యాలయం సిబ్బంది వెళ్లి పరదాలు తొలగించారు. శుక్రవారం రాత్రి మళ్లీ గ్రీన్ మ్యాట్ కట్టి పునాదులు తవ్వడం మొదలు పెట్టారు. శనివారం, ఆదివారం పనులను మరింత వేగవంతం చేశారు. సిమెంట్ కాంక్రీట్ పిల్లర్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. శుక్రవారం రాత్రే గ్రీన్ మ్యాట్ కట్టినప్పటికీ మునిసిపల్, రెవెన్యూ అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడ లేదు. ఈ విషయంపై నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

రాంకీకి పీసీబీ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

తరలించేందుకు పీసీబీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

40 రోజుల వ్యవధిలో రెండోసారి నోటీసులు

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ పీసీబీ) అధికారులు 40 రోజుల వ్యవధిలో రాంకీ యాజమాన్యానికి రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ రాంకీ యాజమాన్యం తీరులో మార్పు కనిపించడం లేదు. ఇప్పటికే పరవాడ, తానాం, భరణికం పరిసర ప్రాంతాలను కాలుష్యంతో నింపేసింది. మరోవైపు పీసీబీ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం తప్ప రాంకీ యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంలేదని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

గవరపాలెం ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలు


క్రికెట్ పోటీలను ప్రారంభించిన జోగినాయుడు

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో ఆదివారం క్రికెట్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. వచ్చే నెల మూడో తేదీన జరిగే అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెస్ట్ ఫ్రెండ్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించగా, క్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు ప్రారంభించారు. అనంతరం విజేతలకు ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నరసింగరావు, చైర్మన్ బీఎస్ అప్పారావు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి బర్నికాన శ్రీనివాసరావులతో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలలో ఘనంగా ఫౌండర్స్ డే


వ్యవస్థాపకుడు లింగమూర్తి విగ్రహానికి పూలమల వేస్తున్న ప్రతినిధులు

కొత్తూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో ఆదివారం ఫౌండర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగమూర్తి విగ్రహానికి కళాశాల గవర్నింగ్ బాడీ అధ్యక్షులు శ్రీదరాల కృష్ణ పేర్రాజు, వర్తక సంఘం అధ్యక్షులు తమ్మన రఘుబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మాట్లాడుతూ లింగమూర్తి జీవిత విశేషాలను తెలిపారు. ఆయన స్థాపించిన ఈ కళాశాలలో ఎంతో మంది విద్యనభ్యసించి నేడు ఉన్నతమైన స్థానాల్లో ఉన్నట్టు చెప్పారు. అలాగే, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు కర్రి శివసూర్యనారాయణ, పెంటకోట బాలకృష్ణ, వాసిరెడ్డి బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ ఉన్నత పాఠశాల 1987-88 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మిత్రా అసోసియేటెడ్ ఫర్ సోషల్ సర్వీస్ (మాస్) పేరుతో గత పదహారేళ్లుగా వీరు సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగా సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సభ్యులంతా కుటుంబాలతో సహా హాజరై రక్తాన్ని దానం చేశారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గుండా సాయి, బొబ్బిలి అప్పలరాజు, భువనగిరి రామకృష్ణ, పేరపు రాంబాబు, జిలానీ బాషా, కొయిలాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలు 'ప్రైవేటు'కు ఇవ్వరాదంటూ నిరసన

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు ఇవ్వరాదంటూ ఆదివారం ఇక్కడి డిపో వద్ద ఎస్ఎంయూఏ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. విజయవాడ గవర్నర్‌పేట-2 డిపో ఎత్తివేసి ప్రైవేటు సంస్థలకు ఇవ్వడాన్ని వీరు వ్యతిరేకించారు. ఆర్టీసీ స్థలాలను పరిరక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ నిరసనలో యూనియన్ నాయకులు ఏఎస్ రావు, వేపాడ శ్రీను, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలపండి'

సబ్బవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి అంతా మరింత కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు అన్నారు. నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులను ఆదివారం ఇక్కడ సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పార్టీ శ్రేణులంతా వీటిని ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతల కనకరాజు, ప్రధాన కార్యదర్శి సబ్బవరపు నాగేంద్ర, కార్యదర్శి వాసు, కోశాధికారి రెడ్డి దేముడుబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రెడ్డి వెంకటేశ్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోతల సత్యనారాయణ, ఎల్‌బీసీ రమణ, పోతల అప్పలనాయుడు, కిల్లి శ్రీనివాస్, మండల తాతబాబు, పోతల దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు పలువురి నివాళి


కలాంకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయనకు పలువురు నివాళులర్పించారు. ఉడ్‌పేట మెయిన్ రోడ్డుపై ఉన్న విగ్రహానికి అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ అల్ల ప్రవీణ్‌కుమార్, రిటైర్డు ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ ఉద్యోగులు, ప్రజా సంఘాలు అంజలి ఘటించారు.

పూల్‌బాగ్ జంక్షన్ కాలువలో మురుగు తిష్ట


అధ్వానంగా ఉన్న మురుగు కాలువ

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నూకాంబిక ఆలయానికి వెళ్లే మార్గంలో గల పూల్‌బాగ్ జంక్షన్‌లో కాలువ దుర్భరంగా మారింది. మురుగు తిష్టవేసి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. స్థానికులతో పాటు అమ్మవారి ఆలయానికి వచ్చేభక్తులు దుర్వాసనను భరించ లేకపోతున్నారు. భారీ వర్షాలు కురిసే సమయాల్లో కాలువలోని మురుగుతో పాటు వర్షపునీరు రోడ్డుపై చేరుతోందని అక్కడివారు చెపుతున్నారు. ఈ సమస్యపై జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది వెంటనే స్పందించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469


వంతెనపై దెబ్బతిన్న ఫుట్‌పాత్


మొలిచిన పిచ్చిమొక్కలు


వంతెన మధ్యలో పైకి లేచిన ఇనుప ఊచలు

రూపు మారిన శారదా వంతెన

- అడుగడుగునా గోతులు.. పైకి లేచిన ఇనుప ఊచలు
- ఫుట్‌పాత్‌లపై పెరిగిన పిచ్చి మొక్కలు
- రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు


అస్తవ్యస్తంగా ఉన్న ఫుట్‌పాత్


వంతెన ఆరంభంలో రహదారి పొడై రాళ్లు పైకి తేలిన దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి ఆనుకొని ఉన్న శారదా నదిపై గల వంతెన అధ్వానంగా మారుతోంది. ఈ వంతెన మీదుగా నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఫుట్‌పాత్‌లు దెబ్బతిన్నాయి. అంతేకాకుండా పలుచోట్ల గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన పైభాగంలో శ్లాబులోంచి ఇనుప ఊచలు పైకి కనిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు ఆ ఊచలు ఎక్కడ కాలుకు తగులుతాయోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన వంతెన మార్గం కూడా రాళ్లు తేలి దర్శనమిస్తుంది. బుచ్చెయ్యపేట, కశింకోట, రావికమతం, నర్సీపట్నం, ఎలమంచిలి మండల ప్రాంతాల నుంచి అనకాపల్లికి ఎవరైనా రావాలంటే ఈ నది వంతెనపై రాకపోకలు సాగించాల్సిందే. గోతులు చిన్నవిగా ఉన్నప్పుడే అధికారులు స్పందించి మరమ్మతులు చేపడితే అవి ముందు మరింత పెద్దవిగా మారవని పలువురు ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో ఆయా గోతుల్లో నీరు నిలిచిపోతుండడం వల్ల ఇది గుర్తించని పలువురు వాహనచోదకులు ఆయా గోతుల్లో పడి గాయాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయని అంటున్నారు.

సాయంత్రం వేళ చాలామంది పట్టణవాసులు చల్లగాలి కోసం వంతెనపైకి వచ్చి సేద దీరుతుంటారు. అటువంటి సమయాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న పిచ్చి మొక్కల నుంచి ఎక్కడ విషసర్పాలు వచ్చి కాటేస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే ఇక్కడి పరిస్థితులపై స్పందించి వంతెనను మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

చెర్లోపలి ఖండాన్ని అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వెల్లడి
- సమస్యను పరిష్కరించిన ప్రభుత్వానికి రైతుల కృతజ్ఞతలు


ఎమ్మెల్యే కొణతాల సమక్షంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెపుతున్న రైతు

కొత్తూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని ప్రధాన ప్రాంతాలకు దీటుగా చెర్లోపలి ఖండం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లిలోని జనసేన కార్యాలయంలో చెర్లోపలి ఖండం భూముల రైతులు ఆదివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి ధన్యవాదాలు తెలిపారు. దాదాపు రెండు దశాబ్దాలుగా పరిష్కారం కాని చెర్లోపలి ఖండం భూముల వ్యవహారాన్ని కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పరిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. వీలైనంత త్వరలో వీఎంఆర్‌డీఏ ద్వారా అభివృద్ధి పనులు ప్రారంభిస్తే మిగిలిన భూములు ఇచ్చేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని వారంతా తెలియజేశారు. దీనిపై ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ ఈ సమస్యను వివరించిన వెంటనే పునరాలోచన చేసి క్యాబినెట్ ఆమోదం తెలిపిన కూటమి ప్రభుత్వానికి మీరంతా కృతజ్ఞతలు తెలపాలన్నారు. త్వరలోనే వీఎంఆర్‌డీఏ వీసీ, అధికారులతో జరగనున్న సమావేశంలో అన్ని అంశాలపై చర్చి అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

పుస్తెలతాడు చోరీ కేసులో తండ్రీకొడుకుల అరెస్టు

సబ్బవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పుస్తెలతాడు చోరీ కేసులో తండ్రీ కొడుకును అరెస్టు చేసినట్టు సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని బాటజంగాలపాలెం జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో గత బుధవారం బోళం నాగలక్ష్మి అనే మహిళ గంటెలను నూర్చుకుంటోంది. ఇంతలో ఒడిశా రాష్ట్రం కొరాపుట్‌కు చెందిన తండ్రీ కొడుకులు కొరాడ సూర్యారావు, కుమార్‌లు అనకాపల్లి వైపు నుంచి బైక్‌పై వస్తూ ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును అపహరించుకుపోయారు. దీనిపై బాధితురాలు సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం రాత్రి సబ్బవరం సమీపంలో నిందితులిద్దరినీ పట్టుకుని అరెస్టు చేశారు. వీరి నుంచి పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి యోగా పోటీలు

- వెన్నెలపాలెంలో నిర్వహణ
- 250 మంది హాజరు



పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



ఆసనాలు వేస్తున్న విద్యార్థినులు

పరవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చునని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. వెన్నెలపాలెంలోని కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దైనందిన జీవితంలో యోగా భాగం కావాలన్నారు. యోగాతోనే కొన్ని రకాల రోగాలను దూరం చేయవచ్చన్నారు. కాగా ఈ పోటీలకు 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపేవారికి వచ్చేనెల జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు అబ్జర్వర్‌గా రాష్ట్ర యోగా అసోసియేషన్ ప్రతినిధి ఎ.శంకరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రవిశంకర్, ఉపాధ్యక్షురాలు కె.శ్రీలక్ష్మి, కార్యదర్శి సీహెచ్.అంజనేయులు, స్థానిక నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు, వెన్నెల పెద్దింటి అప్పలనాయుడు, పైలా వరలక్ష్మి, బండారు సోమినాయుడు, బండారు సతీశ్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదు చికెన్ వ్యర్థాల వాహనాలు సీజ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వ్యర్థాల వాహనాలు

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగర పరిధిలోంచి తూర్పు గోదావరి జిల్లాలో చేపల చెరువులకు తరలిస్తున్న ఐదు చికెన్ వ్యర్థాల వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. చికెన్ వ్యర్థాల వాడకాన్ని విశాఖ జిల్లా కలెక్టర్ నిషేధించడంతో వాటిని పలువురు చేపల చెరువులకు తరలిస్తున్నారన్నారు. దీనిపై ఆదివారం రాత్రి అందిన ముందస్తు సమాచారం మేరకు డైట్ కళాశాల జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. చికెన్ వ్యర్థాలతో ఐదు వాహనాలు వెళ్తుండగా అదుపులోకి తీసుకొని జీవీఎంసీ అధికారులకు అప్పగించినట్టు చెప్పారు. ఈ వాహనాలను విశాఖలోని కంపోస్ట్ యార్డుకు తరలించే ఏర్పాట్లను చేస్తున్నారన్నారు.

మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఇక్కడి సంతబయలు ప్రాంతానికి చెందిన పీలా వెంకటరావు అనే వ్యక్తి తన పాన్‌షాపులో మద్యం అమ్మకాలు సాగించేందుకు ఆదివారం పదకొండు మద్యం బాటిళ్లను తీసుకు వెళుతుండగా, మార్గమధ్యంలో హెడ్‌కాని స్టేబుల్ శ్రీనివాసరావు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

కథల పోటీల్లో బలరామస్వామికి బహుమతి


మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న విజేత

కశింకోట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీ పీఠం నిర్వహించిన జాతీయస్థాయి కథల పోటీల్లో కశింకోటకు చెందిన బొడ్డేడ బలరామస్వామి రచించిన 'కీడుగుడెసె, డేగ కథలకు తృతీయ బహుమతి లభించింది. ఈ మేరకు ఆదివారం ముల్కనూరులో జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా బలరామస్వామి రూ.10 వేల నగదుతో పాటు, ప్రశంసా పత్రం అందుకున్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో ముగిసిన వేడుకలు



పరవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని రాంకీ కమర్షియల్ హబ్ కూడలిలో కొలువైన గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీచక్ర సహిత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు.

డిగ్రీ కళాశాలలో నిధుల ఖర్చుపై ఆడిట్


ఆర్జేడి డాక్టర్ కృష్ణాజీని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సిబ్బంది

సబ్బవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2021- 2025 మధ్య విద్యా శాఖ మంజూరు చేసిన నిధుల ఖర్చుకు సంబంధించి గత ఐదు రోజులుగా జరుగుతున్న ఆడిట్ ఆదివారం ముగిసింది. చివరి రోజు రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పీవీ కృష్ణాజీ ఈ ప్రకియను పరిశీలించారు. కళాశాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, వివిధ కంపెనీలు సమకూర్చిన సీఎస్ఆర్ నిధులను సక్రమంగా ఖర్చు చేశారని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అతనిని ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, ఎస్.సుధీర్, ఎ.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహం స్వల్పంగా ధ్వంసం

- మద్యం మత్తులో రాయి విసరగా ఘటన
- మైనర్ సహా మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి కొత్తూరు పంచాయతీ ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్‌లో గల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శనివారం రాత్రి స్వల్పంగా ధ్వంసం చేశారు. దీనిపై వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేశ్ తదితరులు ఆదివారం సీఐ విజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరిపి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఇద్దరు ఇందుకు పాల్పడినట్టు గుర్తించారు. తాగిన మైకంలో ఒకరినొకరు తోసుకుంటూ, తిట్టుకునే క్రమంలో ఓ మైనర్ ఉల్లింగల శ్రీను అనే వ్యక్తిపై రాయి విసరగా అది విగ్రహానికి తగిలి స్వల్పంగా పెచ్చులూడినట్టు దర్యాప్తులో తేలిందని సీఐ తెలిపారు. ఇందులో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వచ్చే నెలలో బనారస్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు

- పలు రైళ్లు దారి మళ్లింపు
- సంబల్‌పూర్ స్టేషన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులే కారణం

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని సంబల్‌పూర్ స్టేషన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్, యార్డు ఆధునికీకరణ పనులు జరగనున్న నేపథ్యంలో బనారస్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు సహా పలు రైళ్లను రద్దు చేస్తూ, మరికొన్నింటిని మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

విశాఖ-బనారస్ వై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18523) ఆగస్టు 10, 13 తేదీల్లో, బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524) ఆగస్టు 11, 14 తేదీల్లో రద్దుచేశారు. సంబల్‌పూర్-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (20809) ఆగస్టు 8, 10, 11, 15 తేదీల్లో, నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (20810) ఆగస్టు 9, 11, 12, 16 తేదీల్లో, సంబల్‌పూర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ (18301), రాయగడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18302) ఆగస్టు 7 నుంచి 16వ తేదీ వరకు రద్దు అయ్యాయి.

దారి మళ్లింపు..

టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) ఆగస్టు 8 నుంచి 14 వరకు ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా, తిరుగు ప్రయాణంలో ఎర్నాకులం-టాటా ఎక్స్‌ప్రెస్ (18190) ఆగస్టు 7 నుంచి 13 వరకు విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తాయి. తాంబరం-జసిదిహ్ ఎక్స్‌ప్రెస్ (12375) ఆగస్టు 9న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా, తిరుగు ప్రయాణంలో జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376) ఆగస్టు 13న ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా నడుస్తాయి. ఎస్ఎంవీటీ బెంగళూరు-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (12889) ఆగస్టు 8న ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా, తిరుగు ప్రయాణంలో టాటానగర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12890) ఆగస్టు 11న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తాయి. బెంగళూరు-హటియా ఎక్స్‌ప్రెస్ (12836) ఆగస్టు 12న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తుందని డీసీఎం పేర్కొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులు పూర్తి చేయాలి: ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకశ్మీర్ లంబసింగి (తాజంగి)లో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులు పునఃప్రారంభించి పర్యాటక సీజన్ నాటికి అందుబాటులోకి తీసుకు రావాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మాణాలు ప్రారంభించిన మ్యూజియం ఐదు నెలలుగా పనులు నిలిచిపోయాయన్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల సాంకేతపరమైన చిక్కులు వచ్చాయన్నారు. నాలుగు నెలల క్రితం పరిశీలించిన గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్ నవంబరు నాటికి మ్యూజియం అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారన్నారు. ప్రస్తుత తీరు చూస్తే ఆ పరిస్థితి కనిపించడంలేదన్నారు. సాధ్యమైనంత వేగంగా మ్యూజియం పనులు పునఃప్రారంభించాలన్నారు. అలాగే, బలపం ప్రాంతానికి వెళ్లే మూలగరువు కొత్తూరు, లోతుగెడ్డ బ్రిడ్జి మధ్యలో రహదారి అత్యంత అధ్వానంగా ఉన్నదన్నారు. తక్షణమే ఈ నిర్మాణానికి జిల్లా అధికారులు చర్యలుతీసుకోవాలని ఆమె కోరారు.

ఆలయానికి మంగళ వాయిద్య పరికరాలు బహూకరణ


అయ్యప్పస్వామి ఆలయానికి మేళతాళాల డ్రమ్ సెట్ అందిస్తున్న సన్యాసిరావు, కుసుమ దంపతులు

పాడేరురూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పూర్ణపుష్కల అయ్యప్పస్వామి ఆలయానికి సాయిజ్యోతి ఫ్యాన్సీ షాపు యజమాని సన్యాసిరావు, కుసుమ దంపతులు ఆదివారం మంగళ వాద్యాలు, మేళతాళాల డ్రమ్స్ సెట్ బహూకరించారు. ఆలయంలో వివిధ దేవుళ్లు, దేవతా మూర్తుల మేలుకొలుపునకు ఈ మేళతాళాలను ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు ఉపయోగిస్తామన్నారు. ఈసందర్భంగా సన్యాసిరావు దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదిత్య, బూరెడ్డి కొండబాబు, వర్మ సత్యనారాయణరాజు, సత్తిబాబు, దామోదరం, రొబ్బి రాము తదితరులు పాల్గొన్నారు.

బల్లగరువు రోడ్డు పనులు త్వరలో ప్రారంభం

» పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లగరువు నుంచి తుస్సిబ్ వయా దాయర్తి మీదుగా మద్రేబ్ వరకు 12 కిలో మీటర్లకు బీటీ రోడ్డు పనులకు త్వరలో ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు తెలిపారు. 'ఎన్నాళ్లీ నడకయాతన' శీర్షికన ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని జీనబాడు, పినకోట, పెదకోట మూడు పంచాయతీల పరిధిలో ఈ రోడ్డుకుగాను రూ.11.63 కోట్లు పీఎం జన్‌మన్ పథకంలో గత జనవరి నెలలో నిధులు మంజూరయ్యాయన్నారు. ఏప్రిల్ నెలలోని డుంబ్రిగుడ పర్యటనలోని ఉపముఖ్యమంత్రి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారని వివరించారు. ఎమ్మెల్సీ కోడ్ కారణంగా పనులకు ఆటంకం నెలకొందని, అలాగే రెండుసార్లు టెండర్ పిలిచిన కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. త్వరలో మూడోసారి టెండర్ పిలిచి, అగ్రిమెంట్ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని చెప్పారు.


అసంపూర్తిగా మాల మాకవరంలో సచివాలయ భవనం


పునాదులకే పరిమితమైన రైతు సేవా కేంద్రం

అసంపూర్తి భవన నిర్మాణాలకు మోక్షం లేదా?

» మాల మాకవరంలో నిలిచిన సచివాలయ, ఆర్‌బీకే భవన నిర్మాణాలు

» సిబ్బందికి తప్పని ఇబ్బందులు

కొయ్యూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల మాకవరం పంచాయతీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు గత మూడేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆయా కార్యాలయాలు సిబ్బంది వసతి సమస్య నెదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా పెసా కమిటీ ఉపాధ్యక్షుడు పి. మోహన్, గ్రామస్థుడు కోడా రాజబాబు మాట్లాడుతూ, మండలంలో తొలిసారిగా రూ .46 లక్షలతో సచివాలయం, రూ. 30 లక్షలతో రైతు సేవా కేంద్రం భవన నిర్మాణాలకు అప్పటి పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవి శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పటి వరకు ఈ నిర్మాణాలుపూర్తి చేయలేదన్నారు. దీంతో పంచాయతీ కార్యకలాపాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. వీటి నిర్మాణాలకు మంజూరైన నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి దీని వెనుక కారణాలపై ఆరా తీయాలని కోరారు. అలాగే, వీటి నిర్మాణాలు స త్వరం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టరును కోరారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి టీడీపీ లక్ష్యం

» పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. కుమ్మరిపుట్టు ఆమె నివాస గృహంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలాగే, ఉత్తరాంధ్రకు చెందిన పూసపాటి అశోకగజపతిరాజుకు గోవా గవర్నర్ పదవి లభించడం, కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్ర విమానయాన మంత్రిగా నియమించడం, కలిశెట్టి అప్పలనాయుడు ఎంపీ ఎన్నికవడం అధిష్ఠానం ప్రోత్సాహంతోనే సాధ్యమైందన్నారు. వైసీపీ పాలనలో ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగిందన్నారు. పరిశ్రమలు తరలిపోయాయని ఆమె విమర్శించారు. ఇప్పుడు విశాఖకు టీసీఎస్, కాగ్నిజంట్, గూగుల్ వంటి గ్లోబల్ సంస్థలు వచ్చాయని గుర్తుచేశారు. భోగాపురం ఎయిర్ పోర్టు, విశాఖ రైల్వే జోన్, ఐటీ సెజ్, విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు కేటాయించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్రా విజయరాణి, డప్పోడి వెంకటరమణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఓ లాడ్జిలో ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు మాట్లాడారు. పార్టీకి పనిచేసే నాయకులకు గుర్తింపు చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేవీ సురేశ్‌కుమార్, సురేంద్ర, శంకరనాయుడు, హరి, రాము, రాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

నేతలకు గౌరవం చంద్రబాబుతోనే సాధ్యం


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

కొయ్యూరు: ఉత్తరాంధ్ర అభివృద్ధితోపాటు ఇక్కడి నాయకులకు గౌరవం కల్పించటంలోనూ టీడీపీ అధినేత చంద్రబాబు ముందున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు గోవా రాష్ట్ర గవర్నరుగా నియమించడంలో ఉత్తరాంధ్ర పట్ల చంద్రబాబుకు ఉన్న అభిమానం తేటతెల్లమవుతుందన్నారు. ప్రజలు ఆయన ఆశయాలకు అండగా నిలవాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


అవగాహన కలిస్తున్న వాసవ్య మహిళా మండలి ప్రోగ్రాం ప్రతినిధులు

చింతపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు బాల్య వివాహాలు చేయరాదని వాసవ్య మహిళా మండలి ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి. సుబ్బారావు కోరారు. ఆదివారం మండలంలోని తమ్మంగుల పంచాయతీ వర్తనాపాడు, కిలిమిసింగి గ్రామాల్లో మండలి ప్రతినిధులు ఆదివాసీలు, యువతీ, యువకులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసం దర్భంగా కోఆర్డినేటర్ మాట్లాడుతూ బాలికలకు 18, బాలురకు, 21 ఏళ్ల వయస్సు వచ్చే వరకు వివాహం చేయరాదన్నారు. బాలికలకు బాల్య వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.విద్యార్థులు విద్యలో రాణించాలన్నారు.తల్లిదండ్రులు బలవంతంగా బాల్య వివాహాలు చేస్తే మహిళా కానిస్టేబుల్, ఐసీడీఎస్, పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి కౌన్సెలర్లు సంగీత, సంధ్య, కో ఆర్డినేటర్లు అలేఖ్య, మంగ కుమారి, సన్యాసమ్మ, పంతులమ్మ, స్వప్న పాల్గొన్నారు.

క్లస్టర్ స్థాయి క్రీడా పోటీల్లో డీఏవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ



కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించిన సీలేరు జట్టు

సీలేరు, జూలై 27, (ఆంధ్రజ్యోతి):క్లస్టర్ స్థాయిక్రీడా పోటీల్లో సీలేరు డీఏవీ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపారు. విజయవాడ డీఏవీ పాఠశాలలో క్లస్టర్ స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 10 పాఠశాలలు పాల్గొనగా, సీలేరు డీఏవీ పాఠశాలకు అండర్- 17 విభాగంలో 100 మీటర్ల రన్నింగ్ పోటీలో తొమ్మిదో తరగతి చదువుతున్న బి. నితిన్‌కుమార్, 200 మీటర్ల పోటీల్లో పదో తరగతి చదువుతున్న కె.వాసవి ప్రథమ స్థానాల్లో నిలిచారు. అలాగే అండర్- 14 విభాగంలో చెస్ పోటీల్లో నాల్గవ తరగతి చదువుతున్న డి. చాణక్య ద్వితీయ స్థానంలో నిలిచింది. 100 మీటర్ల రన్నింగ్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి అర్జబ్ బిస్వాస్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. బాలుర క బడ్డీ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులకుశిక్షణను ఇచ్చిన పీఈటీ కమలాకర్‌ను విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎస్ కిరణ్‌కుమార్, ఎల్ఎంసీ చైర్మన్ బి. చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


రన్నింగ్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచిన నితిన్‌కుమార్, వాసవి

కూటమి పాలనలో గిరిజన ప్రాంతం అభివృద్ధి

» సుపరిపాలన తొలి అడుగులో టీడీపీ నేతలు

పాడేరురూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థికాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ పదో క్లస్టర్ ఇన్‌చార్జి డప్పోడి వెంకటరమణ అన్నారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి కాడెలి పంచాయతీ వర్తనాపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతో పాటు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి చేపడుతున్న పథకాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కాడెలి పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు మునగ కనకలక్ష్మి, మండల పార్టీ కార్యదర్శి జవ్వాది మహేశ్, నాయకులు కుడుముల కోటిబాబు, డప్పోడి కళ్యాణం, సరమండ సుమన్, సాగెని వెంకటరమణ, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చింతపల్లి: గిరిజన ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని స్థానిక టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు అన్నారు. ఆదివారం సుపరిపాలన తొలిగి అడుగు కార్యక్రమంలో భాగంగా మార్కెట్ వీధిలో ఇంటికి వెళ్లి ప్ర భుత్వ ఏడాది పాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతుందన్నారు. పింఛన్ నగదు పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలను ఇప్పటికే అమలు చేసిందన్నారు. ఆగస్టులో ఉచిత బస్సు సర్వీసు అందుబాటులోకి వస్తుందన్నారు. శివారు గిరిజన గ్రామాలకు రహదారులు, జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా మంచి నీటి పథకాలు ఏర్పాటు చేస్తుందన్నారు. అర్హులకు పక్కా గృహాలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ స్థితిలో ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. ఈకార్యక్రమంలో పెసా కమిటీ, టీడీపీ నాయకులు అనిల్, ముత్యం పెద్ద, శేఖర్, మత్రి మంగ్లు పాల్గొన్నారు.


వర్తనాపల్లి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బాబుతోనే అభివృద్ధి

డుంబ్రిగుడ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి దిశలోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమలను తీసుకొచ్చారన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి: ఈవోపీఆర్‌డీ


ముంచంగిపుట్టులో చెత్త తొలగింపు పనులు

ముంచంగిపుట్టు, జులై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకారం అందించాలని ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, సర్పంచ్ ఎస్.సుభాష్‌చంద్ర పర్యవేక్షణలో పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. వెలుగు, ఎంపీడీవో, జీసీసీ కార్యాలయాలు, సంతబయలు, ఇందిరా కాలనీ, అంబేడ్కర్ పార్కు తదితర ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్ల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సింహాచలం, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ అభ్యర్థులకు వృత్యంతర శిక్షణ

పాడేరురూరల్, జులై 27(ఆంధ్రజ్యోతి): ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వృత్యంతర శిక్షణకు ఆర్టీసీ కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి టి.ఉమామహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్, వెల్డర్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్‌లకు సంబంధించిన అభ్యర్థులు ఆగస్టు 9వ తే దీలోగా (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రంటిషిప్‌ఇండియా.జీవోవీటీ.ఇన్) ఆ న్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అభ్యర్థులు ఆగస్టు 14వ తేదీ ఉదయం 10 గంటలకు విజయనగరం వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న అ భ్యర్థులు అనర్హులన్నారు. వివరాలకు 08922-294906 నంబరుకు సంప్రదించాలన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

పెదబయలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) 87వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివార ం మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ పోలీసులు ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. అసిస్టెంట్ కమాండెంట్ చర్యణ్‌రాజ్ ఆధ్వర్యంలో సీతగుంట జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. మార్గంలో జవాన్లకు స్థానికులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చర్యణ్‌రాజ్ మాట్లాడుతూ దేశరక్షణలోనే కాకుండా గిరిజన ప్రాంతంలో జవాన్లు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. వృద్ధులకు రగ్గులు, దుప్పట్లు , యువతకు విద్యా, క్రీడా సామగ్రిని అందించామన్నారు.


ముంచంగిపుట్టు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఇన్‌స్పెక్టర్


పెదబయలులో బైక్ ర్యాలీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

ముంచంగిపుట్టు: శాంతి భద్రతల సంరక్షణే సీఆర్‌పీఎఫ్ లక్ష్యమని ముంచంగిపుట్టు సీఆర్‌పీఎఫ్ జి198 బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్ ఎం.బి. శంకర్‌రావు అన్నారు. సీఆర్‌పీఎఫ్ 87వ రైజింగ్ డేను ఆదివారం స్థానిక బేస్ క్యాంప్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్, సీహెచ్‌సీ, పలు పాఠశాలల ఆవరణలో మొక్కలను నాటారు. విద్యార్థులకు పలు క్రీడా పోటీలను నిర్వహించి, బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే దేశం కోసం ఆలోచన సాగించాలన్నారు. గ్రామాలకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జె.రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎన్. కృష్ణారావు, సీహెచ్‌సీ వైద్యులు గీతాంజలి, వివేక్, ధరణి, ఉపాధ్యాయులు, జవాన్లు పాల్గొన్నారు.

గోమాంగిపాడు రోడ్డు పనులు ప్రారంభించాలి


రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతున్న గిరిజనులు, మాజీ సర్పంచ్

అనంతగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంగడ పంచాయతీ గోమాంగిపాడు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, మాజీ సర్పంచ్ సీవేరి కొండలరావు, గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ, ఈ రోడ్డుకు ప్రభుత్వం రూ.1.5 లక్షలను మంజూరు చేసినా నిర్మాణం పూర్తికాలేదని వాపోయారు. డుంబ్రివలస రోడ్డు నుంచి గోమాంగిపాడు వరకు సుమారు కిలో మీటరు మేర మాత్రమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందని, దీనిపై గ్రీవెన్స్‌లోఫిర్యాదు చేశామని అధికారులనుంచి స్పందన కానరాలేదన్నారు. వర్షాకాలం కావడంతో గ్రామానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కొండలరావు కోరుతున్నారు.

బర్త్ వెయిటింగ్ హాల్ నిర్మాణానికి స్థల సమస్య

» సీలేరులో ఆస్పత్రిలో గర్భిణుల అవస్థలు


సీలేరు పీహెచ్‌సీలో డెలివరీ అయిన తల్లులు, పిల్లలతో నిండిన బెడ్‌లు

సీలేరు, జూలై 27 (ఆం ధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బర్త్ వెయింటింగ్ హాల్ నిర్మాణానికి అవసరమైన స్థలం కొరత నెలకొంది. ఈ పీహెచ్‌సీకి ఆరునెలల క్రితం బర్త్ వెయింటింగ్ హాల్ మంజూరైంది. అయితే, సీలేరు ప్రాంత మంతా ఏపీ జెన్‌కో ఆధీనంలో ఉంది. దీంతో బర్త్ వెయిటింగ్ హాల్‌కు స్థలం కేటాయించాలని వైద్యాధికారి ఎస్‌కే మస్తాన్‌వల్లీ స్థానిక జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డికి దరఖాస్తు చేశారు. దీంతో వారు పీహెచ్‌సీకి వచ్చి పరిశీలించి అంబులెన్సు పెట్టే షెడ్డు ఉన్న ప్రదేశం, లేదా ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌ను తొలగించి అక్కడ నిర్మించుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ బర్త్ వెయిటింగ్ హాల్‌కు 10 సెంట్ల స్థలం అవసరమని జెన్‌కో ఉన్నతాధికారులకు తిరిగి లేఖ రాశారు. ఇప్పటి వరకు జెన్‌కో స్థలాన్ని కేటాయించలేదు. ప్రస్తుతం పీహెచ్‌సీలో ఉన్న ఒక వార్డులో ఉన్న ఆరు బెడ్స్ గత రెండు మూడు రోజులుగా డెలివరీ అయిన తల్లులు, పిల్లలతో నిండిపోయాయి. ప్రస్తుతం జ్వరాలు, ఇతర రోగాలతో వచ్చే పేషెంట్లకు సెలైన్ బాటిల్స్ ఎక్కించాలన్నా, ఇతర చికిత్స చేయాలన్నా బెడ్లు ఖాళీ లేక ఇబ్బందులు గురవుతున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖా ఉన్నతాధికారులు స్పందించి బర్త్ వెయింటింగ్ హాల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయంతో రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, దీంతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పుష్కలంగా వుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోట్ని బాలాజీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీనరేజ్ కాంట్రాక్ట్ కోసం పట్టు

... 5వ పేజీ తరువాయి

ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయం తీసుకుంది.

అనకాపల్లి జిల్లా కీలకం..

ప్రస్తుత అనకాపల్లి జిల్లాలో మెటల్, గ్రానైట్‌తోపాటు లేటరైట్ క్వారీలు ఉండగా, అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్, విశాఖ జిల్లాలో తక్కువగా క్వారీలున్నాయి. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, విశాఖ, పాడేరులో గనుల శాఖ ఏడీ కార్యాలయాలున్నాయి. ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకున్న క్వారీల నుంచి పూర్తిగా ఆదాయం రావడం లేదు. అనుమతి లేకుండా అనేక క్వారీల నుంచి వందల లారీల రాళ్లు, గ్రావెల్ తరలిపోతోంది. గ్రావెల్ మాఫియా ప్రతి నెలా రూ.కోట్ల విలువైన మట్టి, గ్రావెల్‌ను అనధికారికంగా తవ్వి, తరలిస్తోంది. అనకాపల్లి జిల్లాలో మెటల్ క్వారీల నుంచి ప్రతి రోజూ వందల లారీలతో బండ రాళ్లను రాంబిల్లి వద్ద నేవల్ బేస్ నిర్మాణాల కోసం తరలిస్తున్నారు. వీరెవరూ ప్రభుత్వానికి పైసా చెల్లించడం లేదు. కాగా నాతవరం మండలం సరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో లేటరైట్ తవ్వకాలకు సంబంధించి ఇప్పటివరకు పక్కాగా లెక్కలు లేవు. కాంట్రాక్టరు చెప్పింది రాసుకోడం తప్ప గనులశాఖ పట్టించుకోవడం లేదు. లేటరైట్ తవ్వకాల నుంచి ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదు. ఈ నేపథ్యంలో సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్టును ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని గనుల శాఖ అధికారులు భావిస్తున్నారు.

కాంట్రాక్టు సంస్థల పోటీ

ఉమ్మడి జిల్లాలో గనుల శాఖకు ఇప్పటివరకు నెలకు రూ.11 కోట్లు ఆదాయం వస్తోంది. వసూళ్ల బాధ్యత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే నేపథ్యంలో ఆదాయం పెరుగుతుందని భావించిన అధికారులు రూ.16 కోట్లకు టెండర్లు ఖరారుచేశారు. పోటీ ఉన్నందున కాంట్రాక్టు రూ.20 కోట్లకు చేరుతుందని, దీనివల్ల నెలకు రూ.9 కోట్ల చొప్పున ఏడాదికి సుమారు రూ.102 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతో పాటు అనధికార క్వారీయింగ్, దొంగతనంగా లారీల్లో గ్రావెల్, రాళ్లు, గ్రానైట్, లేటరైట్ తరలింపునకు చెక్ పడుతుందని భావిస్తున్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో అక్రమాలపై శీఘ్ర విచారణ

... 5వ పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, గతంలో ఏసీబీ అధికారులు సమర్పించిన నివేదికను బయటకు తీయించి పరిశీలించారు. ఈ వ్యవహారంపై శ్రీఘ్ర విచారణకు ఆదేశించారు. ఈ మేరకు మంత్రి పేషీ నుంచి ఆదివారం ఒక ప్రకటన వెలువడింది. ఈ విషయం తెలుసుకున్న నాటి అక్రమాలు బెంబేలెత్తిపోతున్నారు.

రాంకీకి పీసీబీ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

తరలించేందుకు పీసీబీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

40 రోజుల వ్యవధిలో రెండోసారి నోటీసులు

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ పీసీబీ) అధికారులు 40 రోజుల వ్యవధిలో రాంకీ యాజమాన్యానికి రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ రాంకీ యాజమాన్యం తీరులో మార్పు కనిపించడం లేదు. ఇప్పటికే పరవాడ, తానాం, భరణికం పరిసర ప్రాంతాలను కాలుష్యంతో నింపేసింది. మరోవైపు పీసీబీ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం తప్ప రాంకీ యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంలేదని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

బేఖాతరు..

... 5వ పేజీ తరువాయి

సమాధుల స్థలం స్కెచ్, సరిహద్దు వివరాలు అందించాని తహసీల్దార్‌ని కోరారు. గత గురువారం మెయిన్ రోడ్డు వైపు గ్రీన్ మ్యాట్ (పరదాలు) కట్టి, లోపల నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, ఆర్డీవో కార్యాలయం సిబ్బంది వెళ్లి పరదాలు తొలగించారు. శుక్రవారం రాత్రి మళ్లీ గ్రీన్ మ్యాట్ కట్టి పునాదులు తవ్వడం మొదలు పెట్టారు. శనివారం, ఆదివారం పనులను మరింత వేగవంతం చేశారు. సిమెంట్ కాంక్రీట్ పిల్లర్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. శుక్రవారం రాత్రే గ్రీన్ మ్యాట్ కట్టినప్పటికీ మునిసిపల్, రెవెన్యూ అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడ లేదు. ఈ విషయంపై నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

వైసీపీ పాలనలో వలస నేతల పాదాల చెంతన ఉత్తరాంధ్ర

- నాయకులకు డమ్మీలుగా చేసి ఏ1, ఏ2 దోపిడీ
- విజయసాయిరెడ్డి రాసలీలలు ప్రజలు మరచిపోలేదు
- ఉత్తరాంధ్ర నేతలకు గౌరవం పెంచింది సీఎం చంద్రబాబు
- చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూలై 27 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉత్తరాంధ్ర నాయకులను ఏ1, ఏ2 పాదాల చెంతన పడి ఉండేలా చేశారని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. ఆదివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో టీడీపీ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో ఉత్తరాంధ్రలో ఆ పార్టీకి చెందిన బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, సీనియర్ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, ధర్మశ్రీ వంటి నాయకులకు కనీసం విలువ లేని విధంగా వలస నేత విజయసాయిరెడ్డి సాగించిన అరాచకాలను ఉత్తరాంధ్ర ప్రజలు మరచిపోలేరన్నారు. విశాఖ కేంద్రంగా విజయసాయిరెడ్డి సాగించిన రాసలీలలు, ఇక్కడ నడిపిన దందాలు ఉత్తరాంధ్ర వాసులంటే వారికి ఉన్న చులకన భావానికి అద్దం పడుతుందన్నారు. జగన్‌మోహనరెడ్డి నాడు ఉత్తరాంధ్ర పాలకులను అవమానిస్తే, సీఎం చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర నాయకులకు అత్యున్నత పీఠాల్లో కూర్చోపెట్టారన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి విశాఖకు చెందిన పల్లా శ్రీనివాసరావుకు, కేంద్రమంత్రి పదవి కింజరాపు రామ్మోహనరావుకు పదవి ఇచ్చి సత్కరించారన్నారు. అత్యున్నతమైన స్పీకర్ పదవి బీసీ నాయకుడు అయ్యన్నపాత్రుడుకు, ప్రధానమైన హోం మంత్రి పదవిని దళిత మహిళ అనితకు ఇస్తే, కొండపల్లి శ్రీనివాస్ లాంటి నాయకులకు గౌరవ పదవులు ఇవ్వడం ద్వారా ఉత్తరాంధ్ర నేతలకు చంద్రబాబు గౌరవించి సత్కరించారన్నారు. ఇక నిజాయతీ, నిబద్ధత కలిగిన అశోక్‌గజపతిరాజుకు గోవా గవర్నర్‌గా పదవిని ఇవ్వడం ద్వారా ఉత్తరాంధ్ర నాయకులు, ప్రజల పట్ల చంద్రబాబు ప్రేమానురాగాలను చాటుకున్నారన్నారు. గోవా గవర్నర్ పదవికి అశోక్‌గజపతిరాజు వన్నె తెస్తారని ఆయన పేర్కొన్నారు.

ఉత్తరాంధ్రపై వైసీపీ పెత్తందారీతనం

వైసీపీ హయాంలో నాటి పాలకులు ఉత్తరాంధ్రపై సాగించిన దోపిడీ, పెత్తందారీతనాన్ని ప్రజలు మరచిపోరని ఎమ్మెల్యే రాజు పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనకు, ఏడాది కాలంలోనే చంద్రబాబు సారథ్యంలో టీడీపీ పాలనకు నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా కనిపిస్తున్నదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నిధులు, విశాఖ రైల్వేజోన్ పనులు ప్రారంభం, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు త్వరితగతిన పూర్తి చేయించడంతో ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టనుందన్నారు. విశాఖలో ప్రముఖ ఐటీ కంపెనీలు రాకతో పాటు నక్కపల్లి వద్ద స్టీల్‌ప్లాంట్‌తో ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, బుచ్చెయ్యపేట మండల టీడీపీ నాయకులు గిరిబాబు, సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, దొంకిన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకోండి

- తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న తాండవ చైర్మన్ సత్యనారాయణ

నాతవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ సమస్యలను తెలుసుకోవాలని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ అధ్యక్షతన ఆదివారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుంచే వచ్చే స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కలసికట్టుగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని తమకు తెలపాలని, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ ఏడాది తాండవ లీకేజీలను అరికట్టడం వల్ల 372 అడుగుల వరకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఆగస్టులో రెండో వారంలో తాండవ నీరు విడుదల చేస్తామన్నారు. నాతవరం పశువైద్య కేంద్రంలో పర్మినెంట్ వైద్యులను నియమించాలని ఈ సందర్భంగా పార్టీ నాతవరం గ్రామ అధ్యక్షుడు పైల సూరిబాబు కోరారు. అంతకు ముందు గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజును నియమించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం లింగంపేట గ్రామంలో ఆదివారం మృతి చెందిన సీనియర్ నేత అల్లు సత్యనారాయణకు సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, ఎస్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, నాతవరం పీఏసీఎస్ చైర్మన్ అపిరెడ్డి మాణిక్యం, నాయకులు పారుపల్లి దాసు, కొండ్రు మరిడియ్య, శెట్టి లోవ, శెట్టి గోపీ, జీరెడ్డి రాజుబాబు, బంగారు సూరిబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రచ్చబండ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు

బుచ్చియ్యపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండలంలోని కోమల్లపూడి గ్రామంలో ఆదివారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం చంద్రబాబునాయయుడు ప్రజలకు సుపరి పాలన అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు తీసుకు వస్తున్నారని అన్నారు. అదే విధంగా మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్ రవాణా సౌకర్యం కల్పిస్తారన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయా? లేదా? అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగేశ్వరిదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ, నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, దొండా నరేశ్, గిరిబాబు, కె.రవి కుమార్, దొడ్డి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర నేతలకు చంద్రబాబు ప్రాధాన్యం

- రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ నాగగంగాధర్

చోడవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సముచిత గౌరవం, ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ హయాంలో దోపిడీకి, అన్యాయానికి గురైన ఉత్తరాంధ్ర నాయకులకు ఎనలేని ప్రాముఖ్యత లభిస్తుందన్నారు. ఇందుకు నిదర్శనం ఉత్తరాంధ్ర సీనియర్ నేత అశోక్ గజపతిరాజుకు గవర్నర్‌గా పదవి రావడమేనన్నారు. అలాగే శ్రీకాకుళంకు చెందిన మరో యువ నేత కింజరాపు రామ్మోహన్‌కు కేంద్ర మంత్రి పదవి ఇప్పించిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ హయాంలో అశోక్ గజపతిరాజును ఎంతో అవమానానికి గురిచేసిన తీరు, కేసులు పెట్టి వేధించిన వైనాన్ని ఉత్తరాంధ్ర ప్రజలు మరచిపోలేరన్నారు. అంతగా అవమానాలకు గురిచేసిన అశోక్‌గజపతిరాజుకు టీడీపీ నేత చంద్రబాబు గవర్నర్ పదవిని ఇచ్చి గౌరవించడం ఎంతో ఆనందదాయకమన్నారు. సుజల స్రవంతికి నిధులు కేటాయించి పనులు పట్టాలెక్కించడం ఉత్తరాంధ్ర రైతుల పట్ల చంద్రబాబు చూపిస్తున్న ప్రేమానురాగాలకు నిదర్శమని గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు.

పుస్తెలతాడు చోరీ కేసులో తండ్రీకొడుకుల అరెస్టు

సబ్బవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పుస్తెలతాడు చోరీ కేసులో తండ్రీ కొడుకును అరెస్టు చేసినట్టు సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని బాటజంగాలపాలెం జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో గత బుధవారం బోణం నాగలక్ష్మి అనే మహిళ గంటె లను సూర్చుకుంటోంది. ఇంతలో ఒడిశా రాష్ట్రం కొరాపు టీకు చెందిన తండ్రీ కొడుకులు కొరాడ సూర్యారావు, కుమార్‌లు అనకాపల్లి వైపు నుంచి బైక్‌పై వస్తూ ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును అపహరించుకుపోయారు. దీనిపై బాధితు రాలు సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం రాత్రి సబ్బవరం సమీపంలో నిందితులిద్దరినీ పట్టుకుని అరెస్టు చేశారు. వీరి నుంచి పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎలమంచిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి-నరసింగపల్లి స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ జి. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగి, ఎడమ చేతిపైన త్రిశూలం పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృత దేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు చెప్పారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ 94906 19020 తెలియజేయాలని కోరారు.

క్షేత్ర స్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి

- పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ



సూర్యనారాయణను సత్కరిస్తున్న మాకవరపాలెం నాయకులు

నర్సీపట్నం/మాకవరపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడుగా శీరంరెడ్డి సూర్యనారాయణ ఒక ప్రకటనలో చెప్పారు. నర్సీపట్నానికి చెందిన సూర్యనారాయణ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడం పట్ల స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవికి నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ సీఎం రమేశ్, జిల్లా అధ్యక్షుడు ద్వారంపురెడ్డి పరమేశ్వరరావుకి ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కాగా బీజేపీ మాకవరపాలెం మండల అధ్యక్షుడు మర్రినాయుడు, తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు అడిగర్ల రాంబాబు, నాయకులు జమీలు, అంజనేయులు, బాబూరావు తదితరులు సూర్యనారాయణకు సత్కరించి అభినందనలు తెలిపారు.

డి.యర్రవరంలో సినిమా షూటింగ్



నల్లగొండమ్మ ఆలయంలో సినిమా షూటింగ్ చేస్తున్న దృశ్యం

నాతవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.యర్రవరం నల్లగొండమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం సినిమా షూటింగ్ జరిగింది. చిత్ర యూనిట్ సభ్యులు ముందుగా ఇక్కడ పూజలు నిర్వహించి హీరో సాయి గణేశ్, నటుడు ఎం.వెంకటేశ్వర్లపై వివిధ సన్నివేశాలను చిత్రీకరించారు. చంద్రహర్షిని మూవీస్ బ్యానర్‌పై 'జాగా' పేరుతోఈ సినిమాను చిత్రీకరిస్తున్నట్టు యూనిట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలోడైరెక్టర్‌గా వైస్‌రెడ్డి, నటులు సాయిగణేశ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారి తనిఖీలు



తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారి కాంతమ్మ

దేవరాపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారి కాంతమ్మ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. హేమ రైతు డిపో, గ్రోమోర్, కాశీపురంలో లక్ష్మీనారాయణ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాలు ముందు ధరలు పట్టిక పెట్టాలని, ఎరువులు కొన్న రైతుకు రశీదులు ఇవ్వాలని, బిల్లు పుస్తకంలో రైతు సంతకం ఉండాలని, రైతుకు ఉన్న భూమిని బట్టి ఎరువులు అందించాలని ఈ సందర్భంగా యజమానులకు ఏవో ఆదేశాలు జారీ చేశారు. రైతు సేవా కేంద్రంలో 24 టన్నులు, సహకార సంఘంలో 24 టన్నుల యూరియా ఉందని ఏవో కాంతమ్మ తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ఏడు రైతు సేవా కేంద్రాల్లో 70 టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

వచ్చే నెలలో బనారస్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఒడిశా లోని సంబల్‌పూర్ స్టేషన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్, యార్డు ఆధునికీకరణ పనులు జరగనున్న నేపథ్యంలో బనారస్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు సహా పలు రైళ్లను రద్దు చేస్తూ, మరికొన్నింటిని మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

విశాఖ-బనారస్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18523) ఆగస్టు 10, 13 తేదీల్లో, బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524) ఆగస్టు 11, 14 తేదీల్లో రద్దు చేశారు.

అలాగే సంబల్‌పూర్-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (20809) ఆగస్టు 8, 10, 11, 15 తేదీల్లో, నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (20810) ఆగస్టు 9, 11, 12, 16 తేదీల్లో, సంబల్‌పూర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ (18301), రాయగడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18302) ఆగస్టు 7 నుంచి 16వ తేదీ వరకు రద్దు అయ్యాయి.



పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సన్యాసిరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజలతో మమేకమై పనిచేయండి

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై పని చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలో ఒమ్మలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జిగా నియామకమైన సందారపు సన్యాసిరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే బండారు ముఖ్య అతిథిగా హాజరై సన్యాసిరావుతో ప్రమాణ స్వీకారం చేయించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోఆపరేటివ్ అధ్యక్ష పదవి ఎంతో కీలకమైనదని, ఈ పదవిని సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో నాయకులు కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉందూరు దేముడు, నాయకులు బుద్ధాల రమణ, కొట్నాల త్రినాధరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు ఆలయాలకు నిధులు మంజూరు

దేవరాపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గంలోని ఏడు ఆలయాల్లో దూప, దీప నైవేద్యం కోసం నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క ఆలయంలో రూ.10 వేలు చొప్పున ప్రతి నెలా ఖర్చు చేస్తారన్నారు. ఈ సొమ్ముతో ఆలయాల్లో దూప, దీప, నైవేద్యాలు కోసం ఏడు వేలు ఖర్చు చేయగా, మూడు వేలు ఆలయంలో అర్చకులకు గౌరవ వేతనంగా కేటాయించారని చెప్పారు. దేవరాపల్లి మండలంలోని మారేపల్లి పాండవులు కొండపై వెలసిన శ్రీదేవీ, భూదేవీ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం, పెదనందిపల్లి సత్యనారాయన మూర్తి ఆలయం, వేచలం రామాలయం, మాడుగుల పిట్టగెడ్డ పురాతన శివాలయం, కొత్తపల్లి ఆదిపరాశక్తి గుడికి, చీడికాడ మండలం తురువోలు మల్లికార్జునస్వామి, ఖండివరం రామాలయం ఆలయాలకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వివరించారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళులు



కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

నర్సీపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పదో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం విగ్రహానికి ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ, వాకర్స్ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం ఎంఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఇస్రో, డీఆర్‌డీఓ ద్వారా దేశానికి కలాం అందించిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు కుప్పిలిస్వామి, సంయుక్త కార్యదర్శి పిట్ట శ్రీనివాసరావు, సభ్యులు శంకర్‌రెడ్డి, ఏవీప్రసాద్, మంతిన గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తూటిపాలలో తలుపులమ్మ జాతర



తూటిపాలలో తలుపులమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటిపాల గ్రామంలో తలుపులమ్మతల్లి పండుగను ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి గ్రామస్థులు ఒకేసారి తరలివెళ్లారు. ఆలయంలో వారంతా ప్రత్యేక పూజలు చేశారు వైసీపీ మండల యువజన అధ్యక్షుడు రుత్తల రాజు, గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు.

వరహాపురంలో పశువుల పండుగ



గ్రామంలో పసుపు, కుంకుమలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

చీడికాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరహాపురం గ్రామంలో ఆదివారం పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా వరినాట్లకు ముందు రైతులు ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం మహిళలు పసుపు, కుంకుమలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పశువులు, మేకలు, గొర్రెలను ఆలయానికి తీసుకువచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు రాకోల వెంకటసత్యనారాయణ, గొల్లవిల్లి రాజబాబు, తాటికొండ సిమ్మునాయుడు, ధర్మిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ప్రచారం



అదానీ స్మార్ట్‌మీటర్లు వద్దంటూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మాకవరపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అదానీ స్మార్ట్‌మీటర్లు వద్దంటూ సీపీఎం నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. తూటిపాల, బూరుగుపాలెం, నగరం, కోడూరు గ్రామాల్లో పార్టీ నేత ఈరెల్లి రంజీవి ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలపై ఇప్పటికే అనేక రకాలైన భారాలు పెరిగాయన్నారు. స్మార్ట్‌మీటర్లు బిగించి ప్రజలపై మరింత భారం మోపవద్దని కోరారు. స్మార్ట్‌మీటర్ల యోచన వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఎంఈవోల బదిలీలు చేపట్టాలి

- ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్

చోడవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారుల బదిలీలు తక్షణమే చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఏఎస్.ధర్మారావు, ఎస్.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీ ఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగిస్తూ విద్యార్థులకు న్యాయం జరగకుండా అడ్డుకుంటున్నదని ఆరోపించారు. తక్షణమే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరారు. ఇటీవల బదిలీ జరిగిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకూ వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమని, రిలీవర్ పేరుతో ఆగిపోయిన ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ జూలై 2023 నుంచి అమలు చేయాల్సి ఉండగా, రెండేళ్లు పూర్తవుతున్నా 12వ వేతన సంఘానికి చైర్మన్‌ను నియమించకపోవడం తగదన్నారు. తక్షణమే 12వ పీఆర్‌సీకి చైర్మన్‌ను నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగు దమ్ము భూసారానికి మేలు

చీడికాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో మురుగు దమ్ము చేయడం వలన భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎ.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి పది సెంటీమీటర్ల సాగునీటిని పొలంలో ఉంచి ముందుగా దమ్ము చేయడం వల్ల అనేక రకాల మొండి కలుపుజాతి మొక్కలు నాశనమవుతాయని చెప్పారు. అలాగే అవి నేలలో కలియడం వల్ల కొంత పోషకాలు అందుతాయన్నారు. ఇలా చేస్తే నీరు పొర లోపలికి పోకుండా ఉంటుందని, పంటకు వేసే ఎరువులు భూమిలోకి పోవని చెప్పారు. జలాశయం నీటితో దమ్ముపట్టి వారం రోజుల తరువాత మరోసారి దమ్ము చేయడం వల్ల పంటకు లాభం చేకూరుతుందని ఏవో సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

బుచ్చెయ్యపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బానోజీరావు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని సూచించారు.

జలాశయం పరిశుభ్రతకు ప్రాధాన్యం

చీడికాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జలాశయం చుట్టూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని నీటిపారుదల శాఖ ఏఈఈ సత్యనారాయణదొర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి నిధులతో జలాశయం గట్టు చుట్టూ వేతనదారులతో తుప్పలు తొలగిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

అన్నార్తులకు భోజనాల ప్యాకెట్లు

చోడవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ తల్లి ట్రస్టు ఆధ్వర్యంలో చోడవరం, అనకాపల్లి ప్రాంతాల్లో అన్నార్తులకు ఆదివారం భోజనాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుమారు 260 మందికి ఆహారం ప్యాకెట్లను సభ్యులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు మదన్‌మోహన్, గొలుకొండ గణేశ్, బీలా సతీశ్, తప్పెట్ల గణేశ్, సంజయ్‌గుప్తా, అనిల్, కార్తీక్, రవి, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

నాతవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేడిపూడిలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సిహెచ్.భీమరాజు తెలిపారు. బెల్టుషాపు నిర్వాహకుడి నుండి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ప్రతి గ్రామంలోనూ మద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎక్కడైనా నాటుసారా విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

అనకాపల్లిలో ఒకరిపై కేసు

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. సంతబయలు ప్రాంతానికి చెందిన పీలా వెంకటరావు తన పాన్‌షాపులో మద్యం విక్రయించడానికి ఆదివారం 11 మద్యం సీసాలను తీసుకువెళుతుండగా, మార్గమధ్యంలో హెచ్‌సీ శ్రీనివాసరావు స్వాధీనం చేసుకున్నారన్నారు. అతనిపై కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

ఐదు చికెన్ వ్యర్థాల వాహనాలు సీజ్

అనకాపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరం నుంచి తూర్పుగోదావరి జిల్లాలో చేపల చెరువులకు తరలిస్తున్న ఐదు చికెన్ వ్యర్థాల వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. చికెన్ వ్యర్థాల వాడకాన్ని విశాఖ జిల్లా కలెక్టర్ నిషేధించడంతో వాటిని పలువురు చేపల చెరువులకు తరలిస్తున్నారన్నారు. దీనిపై ఆది వారం రాత్రి అందిన ముందస్తు సమాచారం మేరకు డైట్ కళాశాల జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. చికెన్ వ్యర్థాలతో ఐదు వాహనాలు వెళ్తుండగా అదుపులోకి తీసుకొని జీవీఎంసీ అధికారులకు అప్ప గించినట్టు చెప్పారు. ఈ వాహనాలను విశాఖలోని కంపోస్ట్ యార్డుకు తరలించే ఏర్పాట్లను చేస్తున్నారన్నారు.